

# ‘జాతీయ సైన్స్ దినోత్సవాన్ని’ జయప్రదం చేద్దాం

## జెవివి ఆవిర్భావ దినోత్సవాన్నీ జరుపుకుందాం

ప్రియమైన మిత్రులారా!

● **భారతదేశం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీని ‘జాతీయ సైన్స్ దినోత్సవం’గా జరుపుకుంటున్నది.** నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ & టెక్నాలజీ కమ్యూనికేషన్ (NCSTC) అభ్యర్థన మేరకు భారతప్రభుత్వం ఫిబ్రవరి -28ని ‘జాతీయ సైన్స్‌దినం’గా ప్రకటించింది.

ఫిబ్రవరి-28 సర్ సి.వి. రామన్ “రామన్ ఎఫెక్ట్”ను కనుగొన్నట్లు ప్రకటించిన రోజు. 1928లో ఆయన ఈ పరిశోధన చేశారు. ఈ పరిశోధనకుగాను ఆయనకు 1930 సంవత్సరంలో ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి వచ్చింది. భారతదేశంలో పరిశోధనలు చేసి నోబెల్ బహుమతి పొందిన ఏకైక శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్. అదికూడా స్వాతంత్ర్యానికి పూర్వం 1930 సంవత్సరంలో. స్వాతంత్ర్యం వచ్చి 68 సంవత్సరాలు గడిచినా భారతదేశానికి మరో నోబెల్ బహుమతి రాలేదు.

హరగోవింద్ ఖొరానా, వెంకట్రామన్ రామకృష్ణన్ లాంటి భారతీయులకు నోబెల్ బహుమతులు వచ్చాయి. కానీ వారు విదేశాల్లో ఉండి పరిశోధనలు చేశారు. ఇంకో నోబెల్ బహుమతి మలేరియాకు కారణాన్ని కొనుగొన్న సర్ రోనాల్డ్ రాస్‌కు వచ్చింది. ఆయన హైదరాబాద్‌లో పరిశోధన చేశారు. కానీ ఆయన విదేశస్తుడు. ఈ దేశంలో పరిశోధన చేసి నోబెల్ బహుమతి పొందిన భారతీయుడు సర్ సి.వి. రామన్ మాత్రమే.అందుకే ఆయన “రామన్ ఎఫెక్ట్”ను ప్రకటించిన రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించింది.

భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతికశాఖ 2017 సంవత్సరానికి "Science and Technology for specially abled persons" అనే అంశాన్ని థీమ్‌గా ప్రకటించడం గమనార్హం.

● **ఇదే ఫిబ్రవరి 28వ రోజున 1988 సంవత్సరంలో జనవిజ్ఞాన వేదిక (ఆం.ప్ర) ఆవిర్భవించింది.** జెవివి ఇప్పటిదాకా రాష్ట్రంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడంకోసం, విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, పర్యావరణం, మూఢనమ్మకాలు మొదలైన అంశాలపై నిరంతరం పనిచేస్తున్నది. ఎందరో బుద్ధిజీవులు తమ సమయాన్ని వెచ్చించి వ్యయప్రయాసలకోర్చి ఈ సంస్థలో పనిచేస్తున్నారు.

జనవిజ్ఞాన వేదిక క్రింది తాత్విక పునాదితో పనిచేస్తున్నది :

- విశ్వాసాన్ని, సైన్సును కలగాపులగం చేయరాదు.
- సైన్సు సార్వత్రికం, విశ్వాసాలు వ్యక్తిగతం.
- పరిశీలించడం, ప్రశ్నించడం, రుజువుపరచడం, సిద్ధాంతీకరించడం, ఇదీ సైన్స్ అంటే.
- మానవ శ్రమ నుండి, వృత్తుల నుండి క్రమానుగతంగా సైన్సు అభివృద్ధి చెందుతూ వచ్చింది.

**పాలనా వ్యవస్థలో ప్రబలంగా ముందుకొస్తున్న అశాస్త్రీయ ధోరణులపై ఎవరేమన్నారు?...**



రాకెట్ లాంచ్ చేయడానికి, ఉపగ్రహాలు అంత రిక్షంలో పంపడానికి ముహూర్తాలు పెట్టడం ఏంటి? వాటి నమూనాలకు పూజలు చేయడం ఏమిటి?

**- వెంకటరామన్ రామకృష్ణన్, నోబెల్ బహుమతి గ్రహీత భారత సంతతికి చెందిన బ్రిటన్ శాస్త్రవేత్త**



ఢిల్లీలో ఎంపీలు, కేంద్రమంత్రులు వాస్తుప్రకారం ఉన్న భవంతులే నివాసాలుగా కావాలంటున్నారు.

**- ఎస్. జైపాల్‌రెడ్డి**
**ఆనాటి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖా మంత్రి**



ముఖ్యమంత్రులు ముహూర్తాలు చూసు కొని ప్రమాణ స్వీకారాలు చేయడమే ఆశ్చర్యం అను కుంటే, ముహూర్తాలు చూసుకొని ఫైళ్లపై సంతకాలు చేయడమేంటి? వాస్తు బాగాలేదని సెక్రటేరియ ట్‌లను తరలించాలని అనుకోవడమేమిటి?

**- డాక్టర్ గేయానంద్, ఎమ్మెల్సీ, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి**

**సాధారణ ప్రజానీకంలో వున్న అశాస్త్రీయ ధోరణులను పోగొట్టాల్సిన అవసరం చాలా ఉంది. ఈ ఉదాహరణలు చూడండి...**

- జమ్మలమడుగు కన్నెలూరు గ్రామంలో మరియు రాజంపేట లోని బలిజపల్లె గ్రామంలోనూ ఇద్దరు మనుషులను దెయ్యాలు చంపాయని ఊరు ఖాళీ చేసే పరిస్థితి నెలకొనడం.
- వేంపల్లి మండల కేంద్రంలో స్కూల్లో దెయ్యం ఉందని, అక్కడి నుంచి పిల్లల్ని మరోచోటికి తరలించాలని తల్లిదండ్రులు కోరుకున్నారు.
- రాజుపాళెం మండలం ఒక హాస్టల్‌లో తమ కళ్ళ నుండి రాళ్ళు పడుతున్నాయని ఆడపిల్లలు నమ్మేశారు.
- ప్రొద్దుటూరు మండలంలో ఒక టీచరు తన డబ్బు కొట్టేసింది ఎవరో తెలుసుకోడానికి పిల్లలందరికీ కర్పూర పరీక్ష పెట్టారు.
- సమస్యలు తీరతాయని, అనారోగ్యాలు పోతాయని క్రిష్ణయ్య స్వాములను, గుర్రం బాబాలను, సంజీవ్‌బాబాలను, స్వస్థత తైలాన్ని, ప్రశ్న చెప్పడాన్ని, భూతవైద్యుల్ని నమ్మడమేంటి?
- కర్పూర చూర్ణం దగ్గరపెట్టుకుంటే స్వైన్ ఫ్లూ నుండి రక్షణ పొందవచ్చని ప్రచారం జరిగింది. దీనికేమైనా ఆధారం వుందా?
- దెయ్యాలు పట్టడాన్ని(?), వాటిని విడిపించడాన్ని (?) మనమంతా ఒక చోద్యంలా చూస్తున్నాం. కానీ ఈ పట్టే దెయ్యాలు పేదలకూ, బలహీనులకూ, మహిళలకూ మాత్రమే ఎందుకు పడుతున్నాయని ఎందుకు ఆలోచించం?

**గర్వించాల్సిన అంశాలపై గర్విందుదాం...**
**ప్రశ్నించాల్సిన అంశాలను ప్రశ్నించుదాం...**

- మన పురాణాలు, ఇతిహాసాలు మన అమూల్య వారసత్వ సంపద. అనితరమైన సాహితీ విలువలున్న గొప్ప వారసత్వం మనది. వాల్మీకి, వ్యాసుడు ప్రపంచంలోని ఏ ప్రసిద్ధ కవికీ తీసిపోరు. కానీ వారి కల్పనలన్నీ చారిత్రక వాస్తవాలంటే ఎలా నమ్మగలం?
- 5వేల ఏండ్లనాడే చక్కటి ప్రణాళికతో మొహంజోదారో, హరప్పా నగరాలను నిర్మంచిన సివిల్ ఇంజినీరింగ్ నైపుణ్యం మన సొంతం. 1600 ఏండ్లనాడే ఢిల్లీలో ప్రతిష్ఠింపబడి ఈనాటికీ తుప్పుపట్టని ఇసుపస్థంభాల్ని పోతపోసిన ఖనిజశాస్త్ర పరిజ్ఞానం మనకుంది. భూమి గుండ్రంగా ఉందని లెక్కలతో నిరూపించిన ఆర్యభట్టు మన భారతీయుడే.

కానీ మనకే అన్నీ ఎప్పుడో తెలుసు అనుకుంటే అది దేశానికి ఏమి మేలు చేస్తుంది?

**పైవన్నీ మనం గర్వించదగ్గ విషయాలు, అంతమాత్రంచేత...**

- మహాభారతంలో కర్ణుడు తన తల్లి కడుపున పుట్టలేదని రాయబడి వుంది, కాబట్టి ఆనాటికే మన దేశంలో జెనెటిక్ ఇంజినీరింగ్ వృద్ధి చెందింది అని వాదించడం శాస్త్రీయ దృక్పథమా?
- వినాయకుడిని ఉదాహరణగా చూపిస్తూ ప్రాచీనకాలంలోనే చనిపోయిన మొండానికి వేరే తల అతికించేంత ప్లాస్టిక్ సర్జరీ పరిజ్ఞానం మనకు తెలుసని చెప్పుకోవడం సమంజసమా? బ్లడ్‌గ్రూపులు తెలియని కాలంలో ఇదెలా సాధ్యమవుతుంది?
- అత్యంత ప్రాచీన కాలంలోనే మనదేశంలో విమానాలు ఎగిరాయని, ఖండాంతరయానం, గ్రహాంతరయానం చేశామని వాదించడం గౌరవప్రదమా? ఇంధనం కూడా తెలియని కాలంలో విమానాల్లో గగన విహారం ఎలా సాధ్యం?
- ఇప్పటికంటే మెరుగైన రాడార్ వ్యవస్థ అప్పుడెప్పుడో వుందని చెప్పుకోవడం మన దేశానికేమైనా ఉపయోగపడుతుందా?

ఈ రకమైన వాదనలు పాలకులు చేస్తున్నారు. పాలకులను మెప్పించి మెరుగైన అధికారస్థానాలు కావాలని కోరుకొనే పెద్దమనుషులు చేస్తున్నారు. ఈ వాదనలు వైజ్ఞానిక ప్రపంచంలో భారతదేశ గౌరవాన్ని పెంచుతాయా? మన బిడ్డల్లో శాస్త్రీయ దృక్పథాన్నీ, జీవితంలో ఏదో సాధించాలన్న తపనని నింపుతాయా?

2017 సైన్స్ దినోత్సవ థీమ్‌గా "Science and Technology for specially abled persons" ప్రకటించుకున్న మనం వేసుకోవాల్సిన ప్రశ్నలివి!

దేశంలోని శాస్త్రీయ దృక్పథం వున్న ప్రతి సైంటిస్టు పాలకులకు వేయాల్సిన ప్రశ్నలివి!

ప్రశ్నించే తత్వంతోనే మానవాళి అనేక విజయాలు సాధించింది. మరి భారతీయులుగా మనం మరెన్నో విజయాల్ని సాధించాల్సిన పనిలేదా?

**ప్రశ్నిద్దామా? మానేద్దామా? ఇదే మనందరి ముందున్న పెద్ద ప్రశ్న.**

కానీ భారతీయ సమాజంలో నేటికీ మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పౌరులందరికీ శాస్త్రీయ దృక్పథం గురించి తెలియజెప్పే బాధ్యత సైన్స్ రంగ కార్యకర్తలందరిపైనా వుంది. కేవలం సైన్స్‌రంగ కార్యకర్తలే కాదు, సమాజం పురోగమించాలని భావించే వ్యక్తులపైన, శక్తులపైన, సంస్థలపైన కూడా ఈ బాధ్యత వుంది.

వ్యక్తిగతంగా విశ్వాసాలు కలిగి వుండడానికి ఎవరికైనా సంపూర్ణమైన స్వేచ్ఛ, అధికారం ఉన్నాయి. కానీ అధికార పదవుల్లో ఉన్నవారు తమ విధుల్లో భాగంగా ఇలాంటి విశ్వాసాలు ప్రదర్శించడం సబబా అన్నదే చర్చనీయాంశం.

- **భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ ప్రతి పౌరుడికి నిర్దేశించిన విధుల్లో....**



- శాస్త్రీయ ఆలోచనల్ని పెంచడం, మానవీయ విలువల్ని పెంచడం, శోధించే తత్వాన్ని పెంచడం, సంస్కరించే ధోరణులను పెంచడం ఒక ప్రధాన కర్తవ్యంగా పేర్కొన్నారు.

పౌరుడికే ఇంత బాధ్యత వుంటే పాలకులకు మరెంత పెద్ద బాధ్యత వుంటుంది?

- **ఈ నేపథ్యంలో, జనవిజ్ఞాన వేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్రింది డిమాండ్లను చేస్తున్నది.**

1) ప్రభుత్వ వేదికలపై అశాస్త్రీయ వాదనలు చేయడం మానాలి. విశ్వాసాల్ని, సైన్స్‌ని కలగాపులగం చేయడం మానుకోవాలి.
2) కేంద్ర బడ్జెట్‌లో 2% నిధులను శాస్త్ర సాంకేతిక రంగాలకు కేటాయించాలి. ఇప్పుడు కేటాయిస్తున్నది కేవలం 0.9% మాత్రమే.
3) ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలికి ఏటా 70-80 లక్షల రూపాయలు మాత్రమే కేటాయిస్తున్నారు. కనీసం రాష్ట్ర బడ్జెట్‌లో 25 కోట్లు ఈ సంస్థకు కేటాయించాలి.
4) శాస్త్రీయ దృక్పథం ప్రచారానికి అధికార యంత్రాంగం అన్ని స్థాయిలో పూను కోవాలి.
5) జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలను, శాస్త్రీయ దృక్పథం ఉన్న ప్రముఖులను భాగస్వాములను చేసి జిల్లాస్థాయిలో శాస్త్రీయదృక్పథం పెంపొందించడానికి ఒక ప్రచార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

- **జనవిజ్ఞానవేదిక ప్రతియేటా ఫిబ్రవరి-28న జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా తన శక్తిమేర కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. విద్యాసంస్థలు, ఇతర సంస్థలు స్వంతంగా కూడా ఈ సందర్భంగా కార్యక్రమాలు నిర్వహించాలని అభ్యర్థిస్తున్నది.**

- **జిల్లా ప్రజానీకానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక "జాతీయ సైన్స్ దినోత్సవ" శుభాకాంక్షలు తెలియజేస్తున్నది. జెవివి ఆవిర్భావ దినం సందర్భంగా కార్యకర్తలకు అభినందనలు.**

విజ్ఞానాభివందనాలతో...

**జనవిజ్ఞాన వేదిక** (ఆం.ప్ర)
**శాస్త్ర ప్రచార విభాగం**
కడప జిల్లా కమిటి

ఫోన్స్ : 97053 33305 96424 88205 94923 78327

VINAG GRAPHICS - 9441040285